క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లాపూర్: పట్టణంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఓమేష్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కొల్లాపూర్, కుడికిళ్ల సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ లైన్లలో విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మల కత్తిరింపు పనులు చేపట్టినందున విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

ప్రశాంతంగా ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఇంటర్ మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్లు ప్రశాంతంగా నిర్వహించారు. అధికారుల ఆదేశాల మేరకు 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి ఏడాదిలో 29 సీట్లు ఖాళీగా ఉండగా స్పాట్ అడ్మిషన్లతో భర్తీ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో బైపీసీలో 22 సీట్లు, ఎంపీసీలో 7 సీట్లను భర్తీ చేశారు. పదో తరగతి పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్లు చేసుకోవడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తరంగిణి ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 128 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పెద్దముద్దునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సృజన మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, డా.సాయిశ్రీ, ఏఎన్‌ఎం కవిత, ఆశావర్కర్లు మానస, కమరున్నీసా పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



కల్వకుర్తి రూరల్: తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత చేపట్టే 72 గంటల నిరాహార దీక్షకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. దీక్షకు యునైటెడ్ పూలే ఫ్రంట్‌తో పాటు తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ మద్దతు ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ సాగర్, గణేష్, మంజుల, సుశీల, అనిల్, శేఖర్ గౌడ్, పార్వతి, మంజుల తదితరులు పాల్గొన్నారు

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్ రావు హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైన ర్యాగింగ్‌కు పాల్పడితే కమిటీ దృష్టికి తీసుకెళ్లాలని లేనిపక్షంలో డయల్ 100 కు ఫిర్యాదు చేయాలన్నారు. అనవసరంగా జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవికుమార్, న్యాయవాదులు బి రామచందర్ , పవన శేష సాయి, కోర్టు ఉద్యోగులు ఎం కేశవరెడ్డి , ఎన్ రాజు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

మన్ననూర్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను 1వ తేదీ నుంచి అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం బ్లాక్ డేగా పాటించాలని మాల మహానాడు డివిజన్ కమిటీ నాయకుడు కల్ముల బాలస్వామి గురువారం ప్రకటనలో కోరారు. అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉదయం 10:30 గంటలకు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. డివిజన్‌లోని మాల, మాల ఉపకులాలకు చెందినవారు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కోతులు, కుక్కల స్వైరవిహారం

- బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- కాలనీవాసులపై దాడులు
- పట్టించుకోని అధికారులు



అచ్చంపేట వీధిలో తిరుగుతున్న కోతులు



అచ్చంపేట ప్రధాన రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

అచ్చంపేట రూరల్: పట్టణంలో రోజురోజుకు కోతుల, కుక్కల బెడద అధికమైంది. పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. చేతిలో ఉన్న బ్యాగ్‌లను సైతం లాక్కొని వెళ్తున్నాయి. చిన్నారులు ఇంటినుంచి బయటకు పంపించేందుకు తల్లిదండ్రులు జంకుతున్నారు. రోడ్ల పక్కల పార్కింగ్ చేసిన బైక్‌లపై కోతులు ఎక్కి ట్యాంక్ కవర్లను, సీట్లను చింపివేస్తున్నాయి. పాదచారులపై దాడులు నిత్యకృత్యమైందని స్థానికులు వాపోతున్నారు. పలువురిపై చేతులు, కాళ్లు, ముఖంపై గాయపర్చిన ఘటనలు ఉన్నాయి. దీనికి తోడు వీధి కుక్కలు సైతం రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్నాయి. రోడ్లపై ఒంటరిగా వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఎప్పుడు దాడులు చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. రాత్రివేళ బైక్‌లను వెంటాడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదారులపై కుక్కలు కన్పిస్తే వాటిని తప్పించుకునేందుకు ఇతర రూట్లలో ప్రయాణిస్తున్నారు.

పలు కాలనీలలో..

పట్టణంలోని మారుతినగర్, జూబ్లీనగర్, పాతబజార్, గాంధీనగర్, టీచర్స్‌కాలనీ, ఆదర్శనగర్, మహేంద్రనగర్, ఇంద్రనగర్, గోకుల్‌నగర్ కాలనీల్లో కోతులు, కుక్కల బెడద అధికమైంది.

భయాందోళనలో ప్రజలు

పట్టణంలోని పలు కాలనీల్లో చిన్న, పెద్ద తేడా లేకుండా కుక్కలు, కోతులు దాడులకు పాల్పడుతున్నాయి. మధ్యాహ్న సమయంలో పాఠశాల నుంచి ఇంటికి తినడానికి వచ్చిన విద్యార్థులపై కోతులు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇది చూసిన కాలనీవాసులు భయాందోళనకు గురై ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు వెనకడుగు వేస్తున్నారు. ఒకవేళ వెళ్లినా కర్రలు చేతిలో పట్టుకుని వెళ్లాల్సిన దుస్థితి. ఒకప్పుడు ఇళ్లలోకి వచ్చి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లే కోతులు ప్రస్తుతం దాడులు చేయడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇంటిలో ఉన్న మహిళలు తలుపులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి కాలనీల్లో నెలకొంది.

పట్టించుకోని అధికారులు

అచ్చంపేట మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రజలను కుక్కలు, కోతుల వల్ల ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వాటిని అరికట్టాల్సిన అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో అవి యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వాటిని అరికట్టేందుకు రూ.లక్షల బడ్జెట్ కేటాయించినా వాటిని అరికట్టలేకపోతున్నారు. శునకాలు, కోతులు అంటేనే పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రధాన రహదారుల్లో కాలనీల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కల దాడితో వాహనదారులు, పాదచారులు బెదిరిపోతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



కోతులు, కుక్కల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లా కేంద్రంలో ఏబీసీ సెంటర్ నిర్వహణ కోసం టెండర్లు పిలుస్తాం. ప్రజలపై దాడులు చేస్తున్న కోతులను, కుక్కలను పట్టుకొని తరలిస్తాం. ఇప్పటికే కొన్ని చోట్ల కోతులను పట్టుకుని వేరే ప్రాంతంలో వదిలినా అచ్చంపేట పట్టణం అడవులకు దగ్గరగా ఉండటంతో మళ్లీ పట్టణానికి వస్తున్నాయి. కౌన్సిల్‌లో ఈ విషయాలపై చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– మురళి, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కొత్త యశోద ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు కార్యక్రమంలో కొత్తగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతోపాటు అర్హులైన కుటుంబాలకు రేషన్‌కార్డులను మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా గ్రామాల్లో రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, కాంగ్రెస్ నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహారావు, అనంతప్రతాప్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ కుటుంబానికి చేయూత

కల్వకుర్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇటీవల మరణించిన భారతీయ జీవిత బీమా ఏజెంట్ గోవిందా చారి కుటుంబానికి లియాఫీ ఆధ్వర్యంలో రూ. 25వేలు గురువారం బోయిన్‌పల్లిలో అందజేశారు. లియాఫీ కల్వకుర్తి శాఖ అధ్యక్షుడు వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి, కోశాధికారి చిదిరె శ్రీనివాస్, అల్వాల్ రెడ్డి, మల్లయ్య, సీనయ్య పాల్గొన్నారు.

చెట్లుంటేనే మానవ మనుగడ

పెద్దకొత్తపల్లి: చెట్లుంటేనే మానవ మనుగడ సాధ్యమని ఎంపీడీఓ నాగేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో వన మహోత్సవంపై సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటేందుకు కూలీల ద్వారా గుంతలను తీయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సిబ్బందికి సూచించారు. ఏపీఓ వెంకటేష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షల విరాళం



కుందారంతండాలో చెక్కు అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

వెల్దండ: మండలంలోని కుందారంతండాలో నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయ అభివృద్ధికి గురువారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.1.50లక్షల విరాళం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి సంతోష్‌చారి వ్యక్తిగతంగా రూ.50వేలను విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గన్యనాయక్, సరేందర్, లోక్యానాయక్, మోతీలాల్, భగ్య, లోకేష్, సోమ్లా, శంకర్, నవీన్, సురేష్, ప్రవీణ్, మహేష్ నాయక్, చిందం కృష్ణయ్య, తంబాలు, తదితరులు ఉన్నారు.

రూ.1.10 లక్షలు విరాళం

మన్ననూర్: స్థానికంగా నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయం నిర్మాణానికి సీబీఎం ట్రస్టు చైర్‌పర్సన్, అమ్రాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ రూ. 1.10 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆలయ నిర్మాణానికి కావల్సిన ఇనుప జాలీలు సహాయం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి గురువారం కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

సలహాదారుల కమిటీ సభ్యుడిగా దినకర్ రావు



నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యులుగా నాగర్ కర్నూల్ జిల్లా వాసి సీనియర్ పాత్రికేయులు, వెన్నెల, కంజీర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత ముచ్చర్ల దినకర్ రావుకు చోటుదక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక దురాచారాలు, చెడు అంశాలపై చర్చించడానికి, సంస్కృతి, కళ, సాహిత్యం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించడానికి కమిటీ చైర్మన్ కోదండరామ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పనిచేయనున్నారు. ప్రభుత్వం ఇరవై మంది పండితులు, ప్రముఖ కళాకారులు, సాహిత్య ప్రముఖులతో ఒక సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే పట్టణానికి చెందిన దినకర్‌రావును సభ్యులుగా నియమించింది. జిల్లాకు చెందిన ముచ్చర్ల దినకర్ రావుకు చోటు కల్పించడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ



తిమ్మాజిపేట: మండలంలోని హనుమాన్‌తండాలో గురువారం పంచాయతీ కార్యదర్శి ఖాజమైనోద్దీన్ స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 మందికి ఇళ్లు మంజూరు అయ్యాయని లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని సూచించారు. నాయకులు గణేష్, మల్లేష్, కృష్ణ, తిరుపతి, హనుమంతు, బొజ్జ, పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

తాడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి కోరారు. గురువారం మండలంలోని గుట్టలపల్లి, ఐతోల్, యాత్మతాపూర్ గ్రామాలను వారు సందర్శించారు. లబ్ధిదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైన అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నిర్మాణ పనులను గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ బలోపేతం చేస్తా

మన్ననూర్: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ రాథోడ్ అన్నారు. మన్ననూర్‌లో అమ్రాబాద్ మండల యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గురువారం శాలువా, పూలబొకెతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. తన ఎంపికకు సహకరించిన సీఎం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్, రాజ్‌గోపాల్, పవన్, శివ, విజయ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పెద్దకొత్తపల్లి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని డాక్టర్ నారాయణస్వామి అన్నారు. భవిష్య భారత్ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో కల్వకోలులో గురువారం ఉచిత సమీకృత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 106 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్, టీబీ రోగులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో భవిష్య భారత్ ప్రోగ్రామ్ మేనేజర్ సాజీద్‌అలీ, శివకుమార్, రమేష్, మెడికల్ క్యాంపు డాక్టర్ పవన్‌కల్యాణ్, సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు వెంకటమ్మ, సుజాత, స్వప్న, మౌనిక, శ్రీకాంత్, చెన్నయ్యలు పాల్గొన్నారు.



రేపు రేషన్ కార్డుల పంపిణీ

లింగాల: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను 2న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పంపిణీ చేస్తారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట నీటి మడుగు



తాడూరు: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట నీటి నిల్వ ఉండడం వల్ల సబ్ స్టేషన్ లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు నిర్మించాలని అధికారులకు తెలిపిన పట్టించుకోలేదని విద్యుత్ సిబ్బంది వాపోయారు. కనీసం తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

యూరియా కొరతను సృష్టిస్తే చర్యలు



యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ చంద్రశేఖర్, ఏఓ రమేష్‌నాయక్

ఉప్పునుంతల: యూరియా బస్తాలను నిల్వ ఉంచి కృత్రిమ కొరతను సృష్టించాలని ప్రయత్నించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అచ్చంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం చంద్రశేఖర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో యూరియాను విక్రయిస్తున్న ఫర్టిలైజర్ షాపులు, పీఏసీఎస్ ఎరువుల గోదాంను ఏడీఏ తనిఖీచేసి యూరియా నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. యూరియా కొరత లేకుండ రైతులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సాగుచేసిన పంటలకు సరిపడ యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నందున రైతులు ఆధైర్యపడొద్దన్నారు. వ్యయసాయ అధికారుల సిఫార్సు మేరకు పంటలకు సరిపడా యూరియాను వేసుకొని దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి కొట్ర రమేష్‌నాయక్, డీలర్లు ఉన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహారావు

కల్వకుర్తి రూరల్: నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో ఉద్యోగులకు భరోసా లేకుండా పోయిందని ఆవేదనవ్యక్తం చేశారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రోష్ మార్చ్ కార్యక్రమం చేపట్టామని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి హాజరుకావాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. 23వ తేదీ నుంచి సీపీఎస్ రద్దు కోసం ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వేముల సైదులు టీఎన్జీవో డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రమోద్, పోరెడ్డి రాజేందర్, రామస్వామి, మల్లేష్, రవీందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

పాత నేరస్తులపై నిఘా తప్పనిసరి



సీఐ, ఎస్‌ఐతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్ రెడ్డి

కల్వకుర్తి రూరల్: దొంగతనాలను అరికట్టేందుకు పాత నేరస్తులపై నిఘా పెట్టాలని కల్వకుర్తి డీఎస్పీ వెంకట్ రెడ్డి సూచించారు. గురువారం కల్వకుర్తి పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఫైల్స్ పరిశీలించారు. సీసీ కెమెరాల ప్రయోజనంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం చేయాలన్నారు. కేసులను పెండింగ్‌లో పెట్టొద్దని సూచించారు. పట్టణంలో గస్తీ పెంచి నేరాలు అదుపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి, ఏఎస్‌ఐ హనుమంత రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

తిమ్మాజిపేట: వ్యవసాయంలో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రావేఫ్ విద్యార్థినులు పేర్కొన్నారు. వనపర్తి వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థినులు మండలంలోని చేగుంటలో వరినాట్లు, క్రిమిసంహారక మందుల వినియోగం తదితర అంశాలపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. వరి నాట్లు వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చీడపీడల నివారణకు వినియోగించే క్రిమిసంహారక మందులపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో రైతుల పంటలను స్వయంగా పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు సాయిశరణ్య, ఐశ్వర్య, పూజిత, హరిప్రియ, నందిని, అనిత, పలువురు రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనపై అవగాహన

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం కాంప్లెక్స్ హెచ్‌ఎం వి.నిరంజన్ అధ్యక్షతన బయోసైన్స్ పాఠ్యాంశంపై స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. లింగాల, బల్మూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, పదర మండలాలకు చెందిన బయోసైన్స్ బోధకులు హాజరయ్యారు. పాఠ్యాంశానకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జీవశాస్త్రానికి సంబంధించి ప్రయోగాలను నిర్వహించారు. ఐఎఫ్‌పీ డిజిటల్ టీవీ ద్వారా పాఠాలను ఏ రకంగా బోధించాలనే దానిపై అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన నిరంజన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు అంజిలాల్, బిక్కు, ధన్‌సింగ్, శంకర్, జంగయ్య, అరవింద్, గోపాల్, నారాయణ, విక్రమ్, భారతి తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్ష పాటించొద్దు



చారకొండ: పౌరహక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఆర్ఐ భరత్ గౌడ్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో గురువారం ఆర్ఐ భరత్ గౌడ్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ రాజ్యాంగం అందరికి సమాన హక్కులు కల్పించిందన్నారు. గ్రామాల్లో కులవివక్ష చూపకుండా కలిసి మెలిసి ఉండాలన్నారు. మూఢనమ్మకాలకు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ద్యాప కేశవ రెడ్డి, సురేష్ నాయక్, గణేష్, అంజన్ రెడ్డి, బక్కయ్య గ్రామస్తులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వసతి గృహంలో భోజనం పరిశీలిస్తున్న డాక్టర్ సింధు

వెల్దండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ సింధు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ బాలికల వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాల, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వండిన ఆహార పదార్థాలపై మూతలు ఉండేలా చూడాలన్నారు. పరిసరా ప్రాంతంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వసతి గృహం ఇన్‌చార్జ్ మంజుల, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్: పట్టణంలో శుక్ర, శని వారం నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పులిజాల పరశురాములు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభలలో భాగంగా పట్టణంలోని గుచ్చుబావి నుంచి మార్కెట్ యార్డ్ వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

తెలకపల్లి: కల్వకుర్తిలో నిర్వహించే సీపీఐ మహాసభలకు తరలిరావాలని రైతు సంఘం నాయకులు సూర్యశంకర్‌గౌడ్ కోరారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ నాయకులు చాడవెంకట్‌రెడ్డి, ప్రజాకవి గోరటి వెంకన్న, ఎం బాల్‌నర్సింహ్మా తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సభకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని కోరారు.

చారకొండ: కల్వకుర్తిలో శుక్ర, శనివారాల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు చిల్వేరు శ్రీనివాసులు కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, రైతుల అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అశోక్ గౌడ్, మద్ది నారాయణ్ రెడ్డి, బాలయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.